క్లుప్తంగా

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న పబ్బతి నాగరాజు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈస్టర్ పర్వదినం సందర్భంగా పబ్బతి నాగరాజు ఆర్థిక సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీలను నాగరాజు ప్రారంభించారు. గెలుపొందిన జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రాంబాబు, రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం సంఘ పెద్దలు కె.క్రిష్టఫార్, బొల్లారం స్వాములు, ఎల్లమద్ది పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి సూచించారు ముడుచుకుపోయిన కాళ్లు, చేతులకు బాల్, ప్యాడ్స్‌పై వైద్యులు వ్యాయామం చేయిస్తారన్నారు. అలాగే ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు, బధిరులకు ఐఈఆర్‌టీ పరికరాలతో విద్యనందిస్తారని తెలిపారు.

ఓర్వకల్లులో ఉచిత వైద్య శిబిరం

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో స్థానిక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సమాఖ్య వ్యవస్థాపకురాలు విజయ భారతి ఆర్థిక సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కర్నూలు విశ్వభారతి హాస్పిటల్ సిబ్బంది వివిధ జబ్బులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరామిరెడ్డి, సమాఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

సుంకేసులకు నిలిచిన ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఆదివారం ఇన్ ఫ్లో నిలిచిపోయింది. డ్యాంలో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

సదరానికి దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: సదరం క్యాంపులు నిర్వహించే తేదీలకై అర్థోపెడిక్, కంటి, మానసిక వికలాంగులు సోమవారం నుంచి ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యుల చేత పరీక్షలు నిర్వహించేందుకు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తేదీలు కేటాయిస్తారన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

గూడూరు రూరల్: కార్పొరేట్ ఆసుపత్రులు పేదలకు మెరుగైన వైద్య అందించాలని సత్యసాయి జిల్లా పుట్టపర్తి సీఐ శ్యామరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని చనుగొండ్ల సచివాలయం వద్ద కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరం నిర్వహణకు కిమ్స్ హాస్పిటల్ నిర్వాహకులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కిమ్స్ మేనేజర్ మొతిబాషా, మాధవస్వామి, ఎంపీటీసీ రంగయ్య, శశికాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు


ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మయ్య

కర్నూలు(న్యూటౌన్): ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం కల్లూరు మండలం ఏ గోకులపాడులో ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాలు రాష్ట్ర కన్వీనర్ సింగం సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అవసరమన్నారు. రసాయన క్రిమిసంహారక మందులు వాడితే భూమిలో సారవంతం పూర్తిగా తగ్గిపోతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే భూములు సారవంతంగా మారి పంటలు బాగా పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల బీజేపీ అధ్యక్షుడు సోమేశ్వరాచారి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.


ఆడపడుచులకు గాజులను తొడిగిస్తున్న మహిళలు


గోలీసోడాతో రుచిని ఆస్వాదిస్తున్న మహిళలు, చిన్నారులు


పసుపు కుంకుమను కొనుగోలు చేస్తున్న మహిళలు


మెగా జాయింట్ వీల్

కొండ'కోన'.. గుండె నిండా జాతర

నోరూరించే మిఠాయిలు.. చిన్నారులను ఉత్సాహ పరిచే ఊయలలు.. మగువలు మెచ్చే రంగు రంగుల గాజులు.. వన్నెలద్దిన గృహోపకరణాలు.. సి.బెళగల్ మండలం క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై శ్రీ కోన వేంకటేశ్వర స్వామి జాతరలో కనువిందు చేస్తున్నాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు జాతరలో సందడి చేస్తున్నారు.అంగళ్లలో వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఎండను సైతం లెక్కచేయక కొండపైకి వెళ్లి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. – సి.బెళగల్


జాతరలో వెలసిన మిఠాయి అంగళ్లు


మినీ వాటర్‌బోట్లలో సందడి చేస్తున్న చిన్నారులు

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

- కల్లూరు మండల అధ్యక్షురాలు బి శారద

కర్నూలు (న్యూటౌన్): ప్రజారంజక పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకుందామని కల్లూరు మండల అధ్యక్షురాలు బి. శారద అన్నారు. ఆదివారం కల్లూరు మండలం సల్కాపురం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలో ఉన్న ఐదు ప్రశ్నలను లబ్ధిదారులను అడిగి సమాధానాలు రాబట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు పడిన ఇబ్బందులను గుర్తు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ పాలనలో చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, సచివాలయ కన్వీనర్ నాగేంద్ర, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

- కల్లూరు అర్బన్ 20వ వార్డులో జేసీఎస్ కన్వీనర్ పి. గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీరెడ్డి స్వయంగా ఇళ్లకు వెళ్లి వారి అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు భీమశంకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాబురెడ్డి, గృహసారథులు పాల్గొన్నారు.


సల్కాపురంలో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను అతికిస్తున్న కల్లూరు ఎంపీపీ శారద

- 28వ వార్డు బీఆర్‌రెడ్డి కాలనీలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ శివశంకర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను పలకరించారు. జగనన్న పాలనలో వారికి జరిగిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రవిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు బోయ శివ, మధు, జగదీష్, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజు మండలాల్లో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు, గూడూరు, సి. బెళగల్, కర్నూలు రూరల్ రెవెన్యూ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే వినతులు అందజేయవచ్చునని ఆయా మండలాల రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు.

పంచలింగాలలో గడప గడపకు మన ప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): పంచలింగాల గ్రామంలో సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ ఎన్ భాస్కర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని వెల్లడించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పోటాపోటీగా ఎడ్ల బండలాగుడు పోటీలు


క్రిష్ణదొడ్డిలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో శ్రీ కోన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర పాల పళ్ల ఎద్దులు బండలాగుడు పోటీలు పోటాపోటీగా సాగాయి. ఇందులో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ. 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను దాతలు అందజేశారు. కాగా పోటీల్లో సి.బెళగల్ మండలం ఇనగండ్ల గ్రామంకు చెందిన బోయబాయి కాటి బోడెన్న, గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామానికి చెందిన సీతారాముడు సంయుక్త ఎద్దుల జత 4,159 అడుగుల దూరం లాగిన మొదటి స్థానంలో నిలవగాచ గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామానికి చెందిన చెవిడి సుంకన్న, ఎమ్మిగనూరు మండలం ఏనుగబాల గ్రామానికి చెందిన ఎల్లప్ప సంయుక్త ఎద్దుల జత 4,151 అడుగుల దూరం లాగి రెండవ స్థానం, ఆస్పరి మండలం పలకలదిన్నె గ్రామానికి చెందిన నాగలింగ ఎద్దు 3,500 అడుగుల దూరంలాగి మూడవ స్థానం, నందవరం మండలం కనపీడుపేట గ్రామానికి చెందిన డీలర్ వీరన్న ఎద్లు 2,250 అడుగుల దూరంలాగి నాల్గవ స్థానం దక్కించుకున్నాయి.

ఘనంగా ఈస్టర్

పాణ్యం: కోడమూరు, పాణ్యం నియోజకవర్గాల్లో ఈస్టర్ వేడుకను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే రోజున శిలువ మరణం పొందిన ఏసుక్రీస్తు పునరుత్థానుడు కావడంతో(మరణాన్ని జయించిన రోజును పురస్కరించుకుని) చర్చిల్లో తెల్లవారుజాము నుంచి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం రంగులు చల్లుకుని భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. పాస్టర్లు దైవ సందేశం చదివి వినిపించారు. ఏసు లోకరక్షకుడు అని చెప్పారు.

- పాణ్యంలోని ఇంటింటి సువార్త చర్చిలో పాస్టర్ ప్రతాప్, ఆసుపత్రి వద్ద ఉన్న దహించు అగ్ని వర్జిన్ సెంటర్ లో ప్టాసర్ బాబన్న ఆధ్వర్యాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

గడివేముల: మండలంలోకి ప్రార్థన మందిరాలు క్రైస్తవులతో కిటకిటలాడాయి. గడివేముల ఏబీఎం పాస్టర్ ప్రసంగి దైవ సందేశమిచ్చారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ బీఎం ప్రభు ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు.అంతకు మందు యువకులు వీధుల్లో తిరుగుతూ ఉత్సహంగా రంగులు చల్లుకున్నారు.


కొండజుటూరులో రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తున్న యువకులు

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి, వర్కూరు, పులకుర్తి, కల్లపరి, లద్దగిరి, గోరంట్ల, అమడగుంట్ల తదితర గ్రామాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్యాలకుర్తిలో రెవరెండ్ రవికుమార్ సంఘపెద్దలతో కలిసి గ్రామపురవీధుల్లో యేసును కీర్తిస్తూ ప్రచారం నిర్వహించారు.


ప్యాలకుర్తిలో యేసు సందేశం వినిపిస్తున్న రెవరెండ్ రవికుమార్

సి.బెళగల్: మండలకేంద్రం సి. బెళగల్‌తో పాటు పోలకల్, గుండ్రేవుల, బురాన్‌దొడ్డి, కంబదహాల్, పలుకుదొడ్డి, కొండాపురం, ముడుమాల, ఇనగండ్ల, కొత్తకోట గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు భారీగా చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


సి. బెళగల్.. ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన


మామిదాలపాడులో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- కోడుమూరు నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగుతున్న కార్యక్రమం
- ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలన గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి కోడుమూరు నియోజకవర్గంలో విశేష స్పందన లభిస్తోంది. గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటిని సందర్శిస్తున్నారు. ఐదు ప్రశ్నలతో వివరాలు సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే సుధాకర్ 38వ వార్డు మామిదాలపాడులో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తూ గృహాలను సందర్శించారు. గృహ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్లను వారి ఇళ్లకు అతికించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాము ఆర్థికంగా ఎంతో నిలదొక్కుకున్నామని పలువురు పేద ప్రజలు చెప్పడం గర్వించదగ్గ విషయమన్నారు. అందుకే ఊరూరా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. మంచి పాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భవిష్యత్తు తరాలకు భరోసా కల్పిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలు అట్టడుగుస్థాయిలో ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ పాలన వారి జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వారంతా జగనన్నకు అండగా నిలబడుతారని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు భాస్కర్, గృహసారథులు మల్లి, రామకృష్ణ, రాంబాబు, శివ, వలంటీర్‌లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో జేసీఎస్ సీబీ తులసిరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వీధుల్లో తిరుగుతూ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. సింగల్ విండో మాజీ అధ్యక్షుడు సీబీ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముడుమాల, పోలకల్, మారందొడ్డి, గొల్లలదొడ్డి, గుండ్రేవుల, తిమ్మందొడ్డి తదితర గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమం కొనసాగింది.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

గూడూరు: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని హక్కిం వీధిలో 'జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రజల అభిప్రాయాలు స్వీకరించారు. పథకాలు కొనసాగాలంటే మరో సారి సీఎంగా జగనే రావాలని , మళ్లీ వైఎస్సార్సీపీకే ఓటు వేయాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. అనంతరం వారి అనుమతితో ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న , సచివాలయ కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు దస్తగిరి, విజయుడు, నంద కిషోర్, కుమార్, మద్దిలేటి, ఖలీల్, షఫి, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.


గూడూరులో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు రూరల్: మండలంలోని చనుగొండ్ల, గుడిపాడు, మునగాల, జూలకల్ గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి జగనన్న పాలన గురించి వివరించి మా నమ్మక నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు దౌల, మహేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తీపి గుళికతో వైద్యం

- హోమియో వైద్యానికి పెరిగిన ఆదరణ
- పదేళ్లతో పోలిస్తే జిల్లాలో పెరిగిన రోగుల సంఖ్య
- జిల్లాలో 19 హోమియో డిస్పెన్సరీలు
- అన్ని చోట్ల ఉచితంగా చికిత్స, మందులు
- దీర్ఘకాలిక జబ్బులకు, మొండి రోగాలకు చక్కటి వైద్యం
- నేడు వరల్డ్ హోమియో డే

కర్నూలు(హాస్పిటల్): ఏదైనా జబ్బు చేసిందంటే కషాయం తాగమంటే అబ్బో చేదు...మాకొద్దు అంటారు. ఇంగ్లిష్ మాత్ర వేసుకోమంటే గొంతులోకి దిగదు. నాకు వేసుకోవడానికి రాదని రకరకాల కారణాలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తారు. కానీ ఎలాంటి కారణాలు చెప్పడానికి వీలులేకుండా మందులు మింగే చికిత్స కేవలం హోమియో మాత్రమే అంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఈ మందులు ఇతర చికిత్సల్లా గాకుండా తియ్యగా ఉంటాయి. నోట్లో వేసుకోగానే కమ్మగా కరిగిపోతాయి. జిల్లాలో పాతికేళ్ల క్రితం ఇద్దరు, ముగ్గురు మాత్రమే ఈ వైద్యులు కనిపించేవారు. ఇప్పుడు ప్రతి నగరం, పట్టణంలో వీరు కనిపిస్తున్నారు. జర్మని దేశానికి చెందిన డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హనిమన్ మొదటిసారిగా హోమియో విధానాన్ని కనుగొన్నారు. ఆయన 1755 సంవత్సరం ఏప్రిల్ 10న జన్మించారు. అందుకే ప్రతి ఏటా ఏప్రిల్ 10వ తేదీన హోమియో డేగా పిలుస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో రెగ్యులర్, ఎన్‌హెచ్‌ఎం కలిపి మొత్తం 19 హోమియో డిస్పెన్సరీలు ఉన్నాయి. రెగ్యులర్‌గా పత్తికొండ, పోలకల్, కర్నూలు, వెల్దుర్తి, నంద్యాల, జిల్లెల్ల, డి.బెళగల్, చనుగొండ్ల, క్రిష్ణగిరి, ఆత్మకూరు, పగిడ్యాల, నేషనల్ హెల్త్ మిషన్‌లో చాపిరేవుల, పెద్ద ఎమ్మనూరు, డోన్, ఉలిందకొండ, పెద్ద తుంబళం, సున్నిపెంట, ప్యాపిలి డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయా డిస్పెన్సరీలకు ప్రతిరోజూ 35 నుంచి 50 మంది వరకు కొత్తగా రోగులు చికిత్స కోసం వస్తున్నారు. కర్నూలు, నంద్యాల, డోన్‌లాంటి చోట్ల ఓపీ రోగుల సంఖ్య దీనికి రెట్టింపుగా ఉంటోంది. అన్ని డిస్పెన్సరీలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచే ఉంటాయి. ఇక్కడ చికిత్స, మందులు పూర్తిగా ఉచితం. దీంతో పాటు కర్నూలు నగరంలో పలు కార్పొరేట్ సంస్థలు అడుగుపెట్టడంతో హోమియో వైద్యానికి మరింత క్రేజ్ ఏర్పడింది. నగరంలో 12 నుంచి 16 దాకా కార్పొరేట్ సంస్థల ఆసుపత్రులు ఉండగా, స్థానిక వైద్యులు జిల్లా మొత్తంగా 650 నుంచి 700 మంది దాకా చికిత్స అందిస్తున్నారు. మొత్తంగా సగటున ఏడాదికి 6 లక్షల మంది దాకా హోమియో వైద్యాన్ని అందుకుంటున్నారు.


హోమియో వైద్య చికిత్సలో మందులు

దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం

హోమియో వైద్య విధానంలో దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆదరణ పెరుగుతోంది. ఇతర వైద్య విధానాల్లో నయం కాని వారు హోమియోకు వచ్చి చికిత్స తీసుకుని వ్యాధిని నయం చేసుకుని వెళ్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇందులో ప్రధానంగా నడుంనొప్పులు, ఆర్థరైటిస్, చర్మవ్యాధులు, తరచూ వచ్చే చీముగడ్డలు, గజ్జి, తామర, చెవిలో చీము కారడం, ముక్కుదిబ్బడ, గొంతునొప్పి, స్టాన్సిలైటిస్, నాజిల్ పాలిప్స్, గ్యాస్ట్రబుల్, మలబద్దకం, పైల్స్, ఫిషర్, ఫిస్టులా, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు, పసిరికలు, అమీబియాసిస్, నరాల సంబంధిత వ్యాధులు(సయాటిక, సర్వికల్ స్పాండిలోసిస్, లాంబార్ స్పాండిలైసిస్), కిడ్నీలో రాళ్లు వంటి దీర్ఘకాలిక సమస్యలకు హోమియో మందులు బాగా ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు



నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా హోమియో వైద్యానికి బడ్జెట్ పెంచారు. ఈ మేరకు ఇటీవల మందులు కూడా పుష్కలంగా వచ్చాయి. అన్ని డిస్పెన్సరీల్లో మందులు అందుబాటులో ఉంచాము. హోమియో డిస్పెన్సరీల్లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నాము. వరల్డ్ హోమియో డేను పురస్కరించుకుని అన్ని డిస్పెన్సరీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాము. అనంతరం వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందించి వ్యాధులపై అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేశాము. –డాక్టర్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఆయుష్ అధికారి, కర్నూలు

వ్యాధి మూలకారణం తెలుసుకుని చికిత్స



హోమియోపతి మందుల ద్వారా అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులను శాశ్వతంగా నయం చేయవచ్చు. ఈ మందుల వల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవు. ఎలాంటి నొప్పి, ఆపరేషన్ లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించవచ్చు. ప్రధానంగా థైరాయిడ్, పీసీవోడీ, షుగర్, బీపీ, సొరియాసిస్ మొదలైన సమస్యలను హోమియో ద్వారా శాశ్వతంగా నివారించవచ్చు. రోగి మానసిక, శారీరక లక్షణాలు పరిగణనలోకి తీసుకుంటాము. తద్వారా వ్యాధి మూలకారణాన్ని కనుగొని రోగికి శాశ్వత పరిష్కారం అందించవచ్చు.

–డాక్టర్ రాజేంద్రప్రసాద్, హోమియో వైద్యులు, కర్నూలు

వ్యక్తికి గాయాలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామ సమీపాన గల పుట్టగొడుగుల పరిశ్రమలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. హుసేనాపురం గ్రామానికి చెందిన దివాకర్ కుమారుడు తిరుపతయ్య గత రెండేళ్ల నుంచి పుట్టగొడుగుల పరిశ్రమలో మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం విధులకు హాజరైన అతను మిషన్ ఆఫ్ చేసే సయమంలో పొరపాటున చక్రాలు తిరుపతయ్యకు తగిలాయి. దీంతో సదరు వ్యక్తికి చెందిన రెండు కాళ్లకు రక్తగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పరిశ్రమ అధికారులు చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేట్ అధికారులుఆసుపత్రికి తీసుకెళ్లారు.

అట్రాసిటీ కేసు నమోదు

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం తడకనపల్లె గ్రామానికి చెందిన షేక్ సలాంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప వెల్లడించారు. తడకనపల్లె గ్రామానికి చెందిన వెంకటరాముడు కుమారుడు ఎస్ శ్రీనివాసులు ఆదివారం సాయంత్రం 5గంటల సమయంలో బస్‌స్టాప్ వద్ద టీ తాగేందుకు వెళ్తుండగా షేక్ సలాం కులం పేరుతో దూషించి దాడి చేశాడు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదుతో సలాంపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

12న క్యాంపస్ డ్రైవ్

కర్నూలు సిటీ: ఈ నెల 12వ తేదీన స్థానిక ఏక్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ డ్రైవ్‌లో బీఎస్సీ కెమిస్ట్రీ, బికామ్, బీఏ, ఐటీఏ, డిప్లమా మెకానికల్, బీ–ఫార్మసీ, ఎంఎస్సీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలైటికల్ కెమిస్ట్రీ) విద్యార్థులు ఉన్న వారు పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు.